సాక్షి
జగిత్యాల

శనివారం । 25 । మే । 2024



వచ్చే ఐదు రోజులు భగభగలే

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో వచ్చే ఐదురోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగానే ఉండి, ఉక్కపోత పెరిగే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 41నుంచి 43 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 24నుంచి 28 డిగ్రీల సెల్సియస్‌గా కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. గాలిలో తేమ ఉదయం 34–57శాతం, మధ్యాహ్నం 13–21శాతం ఉండే అవకాశం ఉందన్నారు. వాయవ్యదిశ నుంచి ఈదురుగాలులు గంటకు 5–16 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు

నేరెళ్ల(జగిత్యాల)	45.6
కమాన్‌పూర్(పెద్దపల్లి)	44.4
కరీంనగర్	42.7
రాజన్న సిరిసిల్ల	42.6

న్యూస్‌రీల్

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



జీవన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్: రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి నేతృత్వంలో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సోనియాగాంధీని వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వచ్చిన అభ్యంతరమేంటని ప్రశ్నించారు. సోనియాపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావని, బేషరతుగా వెనక్కి తీసుకోవాలన్నారు. పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, మిట్టపెల్లి జీవన్‌రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, గోపిడి రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, నాగార్జునరెడ్డి, ఎండీ.రఫీ, సంతోశ్, సురేష్, రాజం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న చరణ్‌దాస్

జగిత్యాలరూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా సెర్ప్ ఏపీడీ చరణ్‌దాస్ అన్నారు. శుక్రవారం జగిత్యాల మండల సమైక్య కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల మహిళ సమైక్య సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫాంలు గడువులోపు అందించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌లింకేజీ నూతన టార్గెట్ ఇవ్వడం జరిగిందని, రూరల్ మండలంలో 890 సంఘాలకు 55.11 కోట్లు, అర్బన్ మండలంలో 169 సంఘాలకు 9.92 కోట్లు లింకేజీ టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపీడీవోలు రమాదేవి, విజయలక్ష్మీ, జిల్లా సెర్ప్ డీపీఎంలు విజయలక్ష్మీ, మానిక్‌రెడ్డి, వెంకటేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, సాగర్, మరియ, గంగారాం పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ అజయ్ కుమార్

కోరుట్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఓపీ వివరాలను సూపరింటెండెంట్ సునీతను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అనంతరం రాయికల్, మెట్‌పల్లి, ధర్మపురి, కోరుట్ల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యాధికారులు సునీత, సాజిద్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 92.5శాతం హాజరు



సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

జగిత్యాల: పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,177 మందికి గానూ 2,017మంది విద్యార్థులు హాజరయ్యారు. 160మంది గైర్హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పలు కేంద్రాలను కలెక్టర్ యాస్మిన్ భాషాతో పాటు కన్వీనర్లు పరిశీలించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

జగిత్యాల: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షలో 1,334 మందికి గానూ 1,243మంది విద్యార్థులు హాజరయ్యారు. 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షకు 665 మందికి 633మంది హాజరు అయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు సకాలంలో కేంద్రానికి హాజరు కావాలని, ఐదు నిమిషాలు ఆలస్యమైతే లోనికి అనుమతించరని కన్వీనర్ నారాయణ తెలిపారు.

ఆమెకు అండగా..



జగిత్యాల మున్సిపాలిటీ



- మున్సిపాలిటీలో మహిళా కమిటీలు
- మహిళా ఉద్యోగులపై వేధింపులు అరికట్టేందుకు చర్యలు
- కమిటీలో అందరూ మహిళా సభ్యులే

జగిత్యాల:

మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తోంది. మున్సిపాలిటీల్లో లైంగిక వేధింపులపై ఫిర్యాదులు స్వీకరించి, సమస్యను పరిష్కరించడం కోసం అంతర్గత కమిటీలు వేస్తున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై వేధింపులను అరికట్టేందుకు సంబంధితశాఖ చర్యలు తీసుకుంటోంది. వారికి రక్షణగా ఉంటూ, చట్ట పరమైన చర్యలు తీసుకునేలా కమిటీలో అందరూ మహిళా సభ్యులు ఉండే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు ఉన్నాయి. అన్నింట్లో కలిపి మహిళా ఉద్యోగులతో పాటు, కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు 500మంది వరకు పని చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో మహిళా ఉద్యోగులపై వేధింపులు పెరుగుతున్నాయన్న నేపథ్యంలో మున్సిపల్‌శాఖ కమిటీలను వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా మున్సిపాలిటీల కమిషనర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మహిళా ఉద్యోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ ఇతర ప్రాంతాల్లో జరిగిన సంఘటన ఆధారంగా మున్సిపాలిటీల్లో కమిటీ వేయాలని నిర్ణయించారు. మహిళా ఉద్యోగులు ఎలాంటి వేధింపులకు గురైనా కమిటీకి ఫిర్యాదు చేస్తే స్వీకరించి సమస్యను పరిష్కరిస్తారు. ఈ కమిటీలో సభ్యులుగా సీనియర్ మహిళా ఉద్యోగులను ఎంపిక చేస్తారు. మహిళా ఉద్యోగులపై ఎలాంటి వేధింపులు జరిగినా ఈ కమిటీకి ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల సమక్షంలో చర్యలు తీసుకుంటారు.

జగిత్యాలలో కమిటీ వేశాం



జగిత్యాల మున్సిపాలిటీలో ఇప్పటికే మహిళా కమిటీలు వేశాం. ఇందులో మహిళా సీనియర్ అధికారులను కమిటీ సభ్యులుగా తీసుకోవడం జరిగింది. ఏదైనా సమస్యలుంటే వీరి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కమిటీ ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

ఉద్యోగులకు ఎంతో మేలు

గతంలో సైతం ఇలాంటి కమిటీలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీలో మాత్రం ఈసారి ప్రత్యేకంగా అంతర్గత కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో చాలామంది ఉద్యోగులు మహిళలే ఉంటున్నారు. కొన్నిచోట్ల వేధింపులకు గురైనప్పటికీ చెప్పుకోలేక ఇబ్బందులకు గురవుతుంటారు. ప్రస్తుతం ఈ కమిటీలు ఏర్పడుతుండటంతో వారు గోప్యంగా సమస్యను చెప్పుకుంటే పరిష్కారమయ్యే అవకాశం మెండుగా ఉంది. కొన్ని సందర్భాల్లో మహిళలు వేధింపులకు గురైనా చెప్పుకోలేకపోతారు. ఉన్నతాధికారులకు చెబితే ఏమైనా సమస్యలు ఏర్పడతాయనే ఉద్దేశంతో లోలోపలే మదనపడుతుంటారు. ప్రస్తుతం ఈ మహిళా కమిటీలు ఏర్పాటు అవుతుండడంతో రక్షణగా ఉంటుందని జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారం ఘనం.. ఏర్పాట్లు శూన్యం



పొలాస విత్తన మేళాలో టోకెన్ల కోసం క్యూలో నిల్చున్న రైతులు

- పోటెత్తిన రైతులు.. దొరకని విత్తనాలు
- 'విత్తన మేళా'లో అన్నదాతల అగచాట్లు
- చేతులెత్తేసిన శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధనస్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తన మేళా ప్రచారం ఘనం.. ఏర్పాట్లు శూన్యం అన్నట్లు జరిగింది. పొలాసలో విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు కొద్ది రోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. శుక్రవారం నాటి కార్యక్రమానికి జిల్లావాసులే కాకుండా పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, అదిలాబాద్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారు. దాదాపు 500 క్వింటాళ్ల వరివిత్తనాలు(దాదాపు 2వేల బస్తాలు) మధ్యాహ్నం 12గంటల వరకే అయిపోయాయి.

ఏర్పాట్లలో విఫలం

గతంలో విత్తనమేళాకు సాధారణస్థాయిలోనే రైతులు వచ్చేవారు. శుక్రవారం ఏకంగా 2వేల నుంచి 3వేల మంది తరలివచ్చారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, టోకెన్ కోసం, డబ్బులు చెల్లించేందుకు, గోదాంలో విత్తనాలు తీసుకునేందుకు వేర్వేరు లైన్లు ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫలితంగా గంటలకొద్ది క్యూలో నిల్చున్నా చాలామందికి విత్తనాలు దొరకలేదు. కొందరు రైతులు సిబ్బంది, శాస్త్రవేత్తలతో వాగ్వాదానికి దిగారు. ఏ మేరకు విత్తనాలు ఉన్నాయో తెలియక శాస్త్రవేత్తలు టోకెన్లు నిలిపివేసి చేతులెత్తేశారు. దీంతో కొందరికి ఒకటి చొప్పున విత్తన బస్తా దొరకగా.. చాలామంది నిరాశతో వెనుదిరిగారు.

ఒక్కబస్తా దొరకలేదు



మా ఊరు నుంచి నలుగురం రైతులం పరిశోధనస్థానానికి వచ్చాం. ఒక్క బస్తా కూడా దొరకలేదు. బస్తాలు అయిపోయాయని చెప్పారు. కొద్దిసేపు చూసి ఇంటికి వెళ్లిపోయాం. విత్తన మేళా ఏర్పాట్లు ఘోరంగా ఉన్నాయి.

– కానుగంటి సురేశ్, మూలరాంపూర్, ఇబ్రహీంపట్నం

గందరగోళంగా క్యూలైన్



మేము మేళాకు వచ్చేవరకు నాలుగైదు క్యూలైన్లు ఉన్నాయి. ఎక్కడికి వెళ్లాలో అర్థం కాలేదు. అప్పటికే ఒక్కొక్కరు క్యూలైన్లలో ఉండి రెండు గంటలయ్యింది అని చెప్పారు. మేము సైతం విత్తనాలు తీసుకోకుండానే వెనుతిరిగాం.

– గురిజాల బుచ్చిరెడ్డి, గొల్లపల్లి

ఒకబస్తా దొరికింది



క్యూలైన్లలో రెండు గంటలు ఉంటే ఒక్కబస్తా దొరికింది. మా ఊరి నుంచి పదిమందిమి వచ్చాం. క్యూలైన్లు ఉన్నప్పటికీ.. కొందరు రైతులు తోసుకురావడంతో గందరగోళం ఏర్పడింది. శాస్త్రవేత్తలు సరైన ఏర్పాట్లు చేయలేదు.

– మల్లారెడ్డి, ఎండపల్లి

నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రత్యేక నిఘా



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- రైతులకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు
- నేరసమీక్షలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేసిన వెంటనే ఫొటోలు సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. ప్రజలకు సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు, వాహన తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిఘా పెంచాలన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టు జారీచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడే కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని సూచించారు. మార్కెట్లో బీటీ3 పత్తి విత్తనాలకు అనుమతి లేదన్నారు. గ్రామాల్లోకి వచ్చి విక్రయించే వారివద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల నివారణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో వ్యవసాయ అధికారుల సాయంతో అన్ని ఎరువుల దుకాణాలు తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర రావు, రంగారెడ్డి, వ్యవసాయ అధికారులు, డీసీఆర్బీ, సీసీఎస్, ఐటీ కోర్ సీఐలు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్ పాల్గొన్నారు.

మల్యాల ఎంపీపీగా రవళి

- అభినందించిన ఎమ్మెల్యే సత్యం



ఎంపీపీని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: మల్యాల మండల పరిషత్ చైర్‌పర్సన్‌గా మల్యాల ఎంపీటీసీ–1 సభ్యురాలు ఆగతంపు రవళి ఏకగ్రీవంగా ఎన్నికైంది. మాజీ ఎంపీపీ మిట్టపల్లి విమలపై గతనెలలో నిర్వహించిన అవిశ్వాస పరీక్ష నెగ్గడంతో వైస్ ఎంపీపీ పోతాని రవిని తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు. నిబంధనల ప్రకారం నూతన ఎంపీపీ నియామకం కోసం ఆర్డీవో నోటీసు జారీ చేసి, శుక్రవారం ఎంపీడీవో స్వాతితో కలిసి ఆర్డీవో మధుసూదన్ మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నియామకం కోసం ఎన్నికలు నిర్వహించారు. మల్యాల మండల పరిషత్‌లో 14మంది ఎంపీటీసీలకు గానూ 8మంది సమావేశానికి హాజరుకాగా, ఎంపీపీగా మల్యాల ఎంపీటీసీ–1 ఆగతంపు రవళి ఒక్కరే నామినేషన్ వేశారు. తాటిపల్లి ఎంపీటీసీ దొంగ అనిత రవళిని ఎంపీపీగా ప్రతిపాదించగా, రాంపూర్ ఎంపీటీసీ బలపరిచారు. మెజారిటీ సభ్యులు చేతులు ఎత్తడంతో ఆర్డీవో మధుసూదన్ రవళిని మల్యాల ఎంపీపీగా ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఎంపీపీ ఆగంతపు రవళివంశీని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మల్యాల మండల కేంద్రానికి వచ్చి ప్రత్యేకంగా అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

జగిత్యాల: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె పట్టణ ఆరోగ్య కేంద్రంతో పాటు పలు సబ్‌సెంటర్లను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వలు, నిర్వహణ పుస్తకాలు, రక్తనమూనాలు టీహబ్‌కు పంపుతున్నారా లేదా వంటి అంశాలను పరిశీలించారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులను వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదు, వారికి అందించే సేవలు, పిల్లలకు వ్యాక్సినేషన్, ఎంసీహెచ్ పోర్టల్ నిర్వహణను పరిశీలించారు. జిల్లాలో 151 సబ్‌సెంటర్లలో సొంత భవనాలు ఉన్నవాటి వివరాలు, నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన రాజ్‌కుమార్ మృతదేహానికి నివాళి అర్పించారు. డీఎంహెచ్‌వో శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు సమియొద్దీన్, శ్రీనివాస్, స్వామి, ప్రవీణ్‌చంద్ర, స్వాతిలక్ష్మణ్, సత్యనారాయణ, రమణ, భూమేశ్వర్ పాల్గొన్నారు.

స్కిజోఫ్రీనియా ఓ మానసిక వ్యాధి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

జగిత్యాలటౌన్: స్కిజోఫ్రీనియా ఓ మానసిక వ్యాధి అని, ఈ వ్యాధికి గురైనవారు అపనమ్మకాలు, హాల్యునేషన్స్‌కు గురై సమాజానికి దూరంగా ఉంటూ విచిత్రంగా ప్రవర్తిస్తుంటారని, నివారణకు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో అధునాతన వైద్యం, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు పేర్కొన్నారు. ప్రపంచ స్కిజోఫ్రీనియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో సైకియాట్రిక్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాములు మాట్లాడుతూ.. మెదడులో జరిగే కొన్ని రసాయన చర్యలతో పాటు జన్యుపరమైన కారణాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఈ జబ్బు సోకుతుందన్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించకపోతే తీవ్రత పెరిగి ఆహారం తీసుకోకపోవడం, ఉన్మాదులుగా మారడం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం లాంటివి జరుగుతాయని అన్నారు. స్కిజోఫ్రినియా నివారణకు యాంటిసైకోటిక్స్ లాంటి మందులు అందించవచ్చని తెలిపారు. సైకియాట్రిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ విశాల్, ఆర్ఎంవో నవీన్, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీధర్, సాకేత్, వరుణ్ పాల్గొన్నారు.

ఆక్వాహబ్ రాదా.. ఉపాధి లేదా?

- నీరులేక మిడ్‌మానేరు వెలవెల
- సిరిసిల్ల ఆక్వాహబ్‌పై నీలినీడలు
- చీర్లవంచ, చింతల్‌ఠాణా వద్ద భూకేటాయింపు
- ఆసక్తి చూపిన మూడు కంపెనీలు వెనక్కి
- అగమ్యగోచరంగా రూ.102 కోట్లు, 365 ఎకరాలు
- అసలు ప్రాజెక్టే ఉండకపోవచ్చంటున్న బీఆర్ఎస్ నేతలు
- 23 వేలమందికి ఉపాధి కల్పన కలే!



సాక్షిప్రతినిధి, కరీంనగర్: గత ప్రభుత్వం సిరిసిల్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆక్వా హబ్ రద్దయ్యిందా? దాదాపు 23 వేల మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా దేశీయ, బహుళజాతీ కంపెనీలను సిరిసిల్లకు ఆహ్వానించేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఇక అడుగు ముందుకు వేసే పరిస్థితి లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో మిడ్‌మానేరులో నీటి లభ్యత, స్థానిక వాతావరణం ఆక్వా హబ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన(టీఎస్ ఐఐసీ) ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలంలో 365 ఎకరాల భూ సేకరణ, ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన అధ్యయనం కూడా పూర్తిచేసింది. కానీ.. ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రాజెక్టు కోసం సిద్ధం చేసిన రూ.102 కోట్లు, 365 ఎకరాల కేటాయింపులు అగమ్యగోచరంగా మారాయి.

ఎక్కడ నిర్మించతలపెట్టారు?

దాదాపు రూ.102.9 కోట్ల వ్యయంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ, చింతలఠాణాలోని ముంపు గ్రామాల్లో ఆక్వా హబ్ ఏర్పాటు చేయాల్సింది. దీనిపై ఇప్పటికే సర్వే పూర్తిచేసిన అధికారులు.. భూకేటాయింపులు కూడా జరిపారు. రెండు గ్రామాల పరిధిలో 365 ఎకరాలు ఇందు కోసం కేటాయించారు. ఇవి మిడ్‌మానేరు ముంపు గ్రామాలు కావడం, గోదావరి బేసిన్‌లో మిడ్‌మానేరు ఉండటం, కాళేశ్వరం నుంచి నిరంతరం నీటిని ఎత్తిపోసే సౌలభ్యం ఉండటంతో టీఎస్ ఐఐసీ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యూహాత్మకంగా ఈ రెండు గ్రామాలను ఎంపిక చేసింది. ఆక్వా రంగంలో సత్తా చాటాలనుకునే కంపెనీలకు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి భూమి, రోడ్లు, విద్యుత్, నీరు, వ్యర్థాల నిర్వహణ తదితర సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చింది. అప్పటికే ఇక్కడ ఫిషింగ్ ఇండియా, ఆనంద్ గ్రూప్స్, ఫ్రెష్ టు హోమ్ సంస్థలు కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. మత్స్య పరిశ్రమ ఏర్పాటై ఉండేది. ప్రభుత్వం మారడంతో టీఎస్ ఐఐసీ, స్థానిక కలెక్టర్, రెవెన్యూ అధికారులెవరూ ప్రాజెక్టు మనుగడపై ఇంతవరకూ ప్రకటన చేయలేదు.

బంజరు భూమి, కొండ ప్రాంతాలు..

వాస్తవానికి చీర్లవంచ, చింతలఠాణా రెండూ ముంపుగ్రామాలే. ముంపు పోను రెండు గ్రామాల్లో మిగిలిన సర్వే నంబర్లు 224, 225, 226, 310, 613, 614, 698, 699, 701, 702, 704, 715, 718, 719లోని 365 ఎకరాలను ఈ పరిశ్రమ నిర్మాణానికి కేటాయించారు. ఇందులో అధికశాతం బంజరుభూమి, కొండ ప్రాంతం. అందుకే, ఇక్కడ ఆక్వా హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆక్వా హబ్‌కు ప్రతీరోజు 15.52 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని అందించాలనుకున్నారు. పరిశ్రమల నుంచి 10.8 ఎంఎల్‌డీ రిసైకిల్డ్ వాటర్ విడుదలవుతుందని అంచనా వేశారు. అంతేకాకుండా నీటి వ్యర్థాల శుద్ధికి 13 ఎంఎల్‌డీల సామర్థ్యంతో భారీ ఎస్టీపీ, ఇక ఘన వ్యర్థాలు, ఎలక్ట్రిక్‌వ్యర్థాల నిర్వహణను టీఎస్ ఐఐసీ చూసుకుంటానంది.

ఆ కంపెనీలు వెనక్కే?

ఆక్వా హబ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఫిషింగ్ ఇండియా, ఆనంద్ గ్రూప్స్, ఫ్రెష్ టు హోమ్ సంస్థలు ఆసక్తి చూపాయి. కంపెనీలు ఏర్పాటు చేసేందుకు వీలుగా 194 ఎకరాలు ప్లాటింగ్, 79 ఎకరాల్లో పచ్చదనం, రోడ్ల కోసం 31 ఎకరాలు, సామాజిక సదుపాయాల కింద 14 ఎకరాలు కేటాయించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా తంగళపల్లి నుంచి 120 అడుగుల పొడవుతో రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. తొలిదశలో రూపొందించిన ప్రణాళిక ప్రకారం.. మరిన్ని కంపెనీలు హబ్‌లో కొలువు దీరితే.. తొలిదశలో దాదాపు 5,000 మందికి, ప్రాజెక్టు పూర్తయ్యాక దాదాపు 17,500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. అందులోనూ తొలుత మిడ్‌మానేరులోని ముంపుగ్రామాలకు.. ఆ తర్వాత ఉమ్మడి జిల్లా యువతకు కొలువుల్లో ప్రాధాన్యం దక్కుతుందని అంతా అనుకున్నారు. కానీ.. ప్రాజెక్టు ఇక రద్దయినట్లేనని బీఆర్ఎస్ నేతలు వాఖ్యానిస్తుండటంతో స్థానిక యువతలో తీవ్ర నిరాశ ఆవహించింది.

క్లుప్తంగా

ఎల్లమ్మ గుడికి తాళం వేసిన వారిపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన దళితులు

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో ఎల్లమ్మ గుడిలోపలికి దళితులను ప్రవేశించకుండా తాళం వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అనుపమ, ఎస్సై లక్ష్మారెడ్డికి దళితులు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎల్లమ్మ గుడిలోనికి మొక్కులు చెల్లించుకోవడానికి ఆలయానికి వెళ్లగా లోనికి వెళ్లకుండా గౌడ కులస్తులు గుర్రం భిక్షపతి, గుర్రం తిరుపతి, తాళం వేశారని, తాళం ఎందుకు వేశారని ప్రశ్నించగా గుడిని మేమే కట్టించుకున్నాము, గుడి ఎదుట కొబ్బరి కాయలు కొట్టుకోవాలని సమాధానం ఇచ్చారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సముద్రాల సంపత్, భద్రయ్య, శ్రీనివాస్, నర్సయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లిలో శ్రీగంధం తోట దగ్ధం



కాలిపోయిన శ్రీగంధం చెట్లు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీగంధం చెట్లు శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఎడమల తిరుపతిరెడ్డి, పాకాల నడిపి నర్సయ్య, పాకాల చిన్న మల్లయ్య వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. ఈ ముగ్గురూ శ్రీగంధం చెట్లు పెంచాలని నిర్ణయించుకున్నారు. తిరుపతిరెడ్డి తన మూడు ఎకరాల విస్తీర్ణంలో 900 చెట్లను నాటాడు. పాకాల నడిపినర్సయ్య, చిన్న మల్లయ్య రెండు ఎకరాల్లో చెట్లను పెంచుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని, ముగ్గురికి చెందిన చెట్లు కాలిపోయాయి. తిరుపతిరెడ్డికి రూ.15 లక్షల వరకు, నర్సయ్య, మల్లయ్యలకు రూ.15లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు.

తీసుకున్న అప్పు చెల్లించడం లేదని వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని మిషన్ కంపౌండ్ ప్రాంతానికి చెందిన కొయ్యాల రతన్‌రాయల్(58) అప్పు తీసుకున్న వ్యక్తి చెల్లించడం లేదని శుక్రవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 2021లో రతన్‌రాయల్ వైజాగ్ షిప్‌యార్డ్‌లో కర్ర శ్రీనివాసమూర్తితో పనిచేశాడు. రతన్‌రాయల్ భార్య కొయ్యాల విజయశీల పేరిట కర్ర శ్రీనివాసమూర్తి మంచిర్యాలలో ఉన్న భూమిని మార్టిగేజ్ చేసి దశలవారీగా రూ.45 లక్షలు అప్పు తీసుకున్నాడు. కొద్దిరోజులుగా అప్పు చెల్లించకపోవడంతో పాటు, మార్టిగేజ్ చేసిన భూమిని వీరికి తెలియకుండా ఇతరులకు విక్రయించాడు. మనస్తాపానికి గురైన రతన్‌రాయల్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య విజయశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాసుల కోసం తనిఖీలు

- ఎన్నికల డబ్బు పేరిట కలకలం
- తప్పుడు సమాచారమా ?
- తనిఖీల్లో దొరకని నగదు



కోరుట్ల: రెండు రోజుల క్రితం.. కోరుట్ల సెగ్మెంట్‌లోని మూడు ఇళ్లల్లో పోలీసులు తనిఖీలు చేపట్టడం స్థానికంగా కలకలం రేపింది. కోరుట్ల పట్టణంలోని రెండు ఇళ్లు, మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో మరో ఇంటిలో పోలీసులు తనిఖీ చేయడం చర్చనీయంగా మారింది. ఎన్నికల్లో పంపిణీ చేసిన డబ్బుల డంప్‌లు మిగిలి ఉన్నట్లుగా వచ్చిన సమాచారంతో తనిఖీలు చేశారని ఓ వైపు ప్రచారం జరుగుతుండగా, మరోవైపు హవాలా డబ్బుల కోసం కావచ్చనే పుకార్లు జోరందుకున్నాయి. అయితే మూడు ఇళ్లల్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి నగదు దొరకలేదు.

సమాచారం ఆలస్యమా ?

పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులు జోరుగా డబ్బులు పంపిణీ చేశారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారం నేపథ్యంలో అప్పటి డబ్బులు అట్టపెట్టెల్లో ఉంచి దాచి ఉంచారన్న సమాచారం పోలీసులకు ఎన్నికలు ముగిసిన తర్వాత అందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతస్థాయి పోలీసు అధికారుల నుంచి అందిన సమాచారాన్ని ధ్రువీకరించే క్రమంలో పోలీసులు మూడు ఇళ్లల్లో ఒకే సమయంలో తనిఖీలు నిర్వహించినా ఎలాంటి నగదు దొరకలేదు. పోలీసులు తనిఖీలు నిర్వహించిన మూడు ఇళ్లల్లో ఒకటి కోరుట్లలోని సాయిరాంపురా కాలనీలో నివసించే కాంగ్రెస్ సేవాదళ్ నాయకునిది కాగా, మరొకటి కోరుట్ల పోలీస్‌స్టేషన్ వెనకబాగంలో ఉండే వ్యక్తిది కావడం గమనార్హం. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో పోలీసులు తనిఖీలు చేసి ఇంటి యజమాని ఓ రైతుగా తెలిసింది. ఈ మూడు ఇళ్లల్లో డబ్బులు ఉన్నాయన్న సమాచారం తప్పు అని పోలీసుల తనిఖీల్లో తేలింది.

లెక్కలేని కాసుల మాట ఉత్తిదే..

పోలీసులు తనిఖీలు చేసిన ఇళ్లల్లో లెక్కలేని డబ్బులు ఉన్నాయని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని తేలింది. పోలీసులకు వచ్చే సాధారణ సమాచారంలో భాగంగా ఆయా ఇళ్లల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున డబ్బులు దొరకలేదు. ఓ ఇంట్లో ఒకటి, రెండు ప్రామిసరీ నోట్లు, మరో ఇంట్లో రూ.4వేలకు పైగా నగదు దొరకడంతో తమకు వచ్చిన సమాచారం తప్పు అని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై కోరుట్ల సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ.. పోలీసులు తనిఖీల్లో డబ్బులు దొరికాయన్న ప్రచారంలో నిజం లేదన్నారు.

10న రాష్ట్రస్థాయి సదస్సు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు



మాట్లాడుతున్న ఆర్.వెంకటరాములు

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూన్ 10న రాష్ట్రస్థాయి ఉపాధి హామీ సదస్సు నిర్వహిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు తెలిపారు. నగరంలోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో శుక్రవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చుతోందన్నారు. ఈజీఎస్ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజూ రూ.600 కూలి చెల్లించాలని, ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని, పని చేసే చోట నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు, పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంల అనేకమంది పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారని, వాటికి పట్టాలిచ్చి స్థలాలు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అందులో డబల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గన్నేరం నర్సయ్య, మాతంగి శంకర్, రాయికంటి శ్రీనివాస్, చిలకబాబు, సుంకరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి

- బావురుమంటున్న బాధితులు
- పోలీసులపైనే ఆశలు
- బంధువుల డబ్బులు పూజారికిచ్చి అవస్థలు

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన పూజారి మహేశ్ రూ.2కోట్లతో ఉడాయించిన ఘటనలో ఇరుక్కున్న బాధితులు బావురుమంటున్నారు. ఈనెల 4 నుంచి పూజారి ఆచూకీ కోసం నిత్యం అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. తమ డబ్బులే కాకుండా బంధువులు, మిత్రుల వద్ద తీసుకొచ్చి మహేశ్‌కు అప్పగించామని, ఇప్పుడు వారికి తామే జవాబుదారీగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చాలా మంది మధ్యవర్తిగా ఉండి అప్పులు ఇప్పించి జమానత్, ష్యూరిటీ సంతకాలు చేసి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపితే తప్ప తమ సమస్యకు పరిష్కారం లభించేలా లేదని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి. ఇప్పటికే బాధితుల గోడు విన్న పోలీసులు ఫిర్యాదులు స్వీకరించి విచారణ ముమ్మరంగా చేపట్టారు.

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి

- పొలాస పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్
- విత్తన మేళాకు విశేష స్పందన



విత్తనాల సంచులు అందిస్తున్న శ్రీనివాస్

జగిత్యాలఅగ్రికల్చర్: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధనస్థానంలో శుక్రవారం విత్తనమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒకసారి విత్తనం తీసుకెళ్లి, ఆ పంట నుంచి విత్తనాలు తయారు చేసుకోవాలని సూచించారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే, పరిశోధన స్థానం నుంచి బ్రీడర్ సీడ్ ఇచ్చి ప్రోత్సహిస్తామని అన్నారు. సంఘాల్లోని రైతులు బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్, సర్టిఫైడ్ సీడ్, ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్ తయారు చేసి విక్రయిస్తే, సంఘాలతో పాటు రైతులు అభివృద్ధి చెందుతారని సూచించారు. ప్రతీ విత్తనానికి మార్కెట్‌పై ఆధారపడటం మంచిది కాదన్నారు. పరిశోధనస్థానంలో శాస్త్రవేత్తలు కొద్ది మొత్తంలో మాత్రమే విత్తనం తయారు చేస్తారని, అది సైతం అభ్యుదయ రైతులకే ఇస్తామని అన్నారు. ఒక్కసారిగా విత్తనమేళాకు భారీగా రైతులు రావడంతో కొంత ఇబ్బంది ఏర్పడినప్పటికీ, రైతులకు తలాఒక్కటి, రెండు చొప్పున వరి విత్తనాలు విక్రయించామని అన్నారు. ఈ సందర్భంగా వరి శాస్త్రవేత్త శ్రీనివాస్ విత్తన రకాలు, లక్షణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, గోన్యానాయక్, పద్మజ, రవి, రజనీదేవీ పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడిన బ్యాగుదొంగ?



పోలీసులకు పట్టుబడిన అనుమానిత దొంగ

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాలక్రైం: ఈనెల 20న కరీంనగర్‌కు చెందిన వందన అనే మహిళ కరీంనగర్ బస్టాండ్‌లో బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగుతో బస్సు ఎక్కి ప్రయాణిస్తుండగా సినీఫక్కీలో బ్యాగును గుర్తుతెలియని దొంగ చోరీ చేశాడు. బంగారం చోరీ అయిందని కోరుట్ల, జగిత్యాల పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కేసు నమోదు చేసేందుకు నిరాకరించడంతో సదరు మహిళ జిల్లా పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించింది. దీంతో ఈనెల 21న ‘సాక్షి’లో ‘బస్సులో ఆభరణాల బ్యాగు చోరీ’ అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు సీసీపుటేజీ ఆధారంగా దొంగను గుర్తించారు. మెట్‌పల్లి మండలం ఆరెపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని, సొత్తు కూడా రికవరీ చేసి విచారణ చేపట్టినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

దివ్యాంగులకు శిక్షణ

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని శారీరక, బంధిర, అంధ విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి ఎంసెట్‌లో శిక్షణ ఇస్తామని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 7జీపీఏ లేదా ఆపై గ్రేడ్‌సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈనెల 30లోగా ఈ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలిజాబితాలో ఎంపికైన విద్యార్థుల జాబితాను జూన్ 3న వెబ్‌సైట్‌లో పొందుపర్చుతారని, ధ్రువీకణపత్రాల ఆధారంగా జూన్ 6న తుది జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని ఆమె వివరించారు.

విద్యుత్ అంతరాయంతో కోళ్లు మృతి

- పౌల్ట్రీరైతుకు రూ.3లక్షలు నష్టం



కరెంట్ లేక ఊపిరాడక మరణించిన కోళ్లు



చనిపోయిన కోళ్లను చూపుతున్న రాజిరెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పౌల్ట్రీ కోళ్లఫాంకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి వెయ్యి కోళ్లు మృతిచెంది రూ.3లక్షల నష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత పౌల్ట్రీరైతు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సద్ది రాజిరెడ్డికి గల పౌల్ట్రీఫామ్‌లో 4వేల కోళ్లు ఉన్నాయి. పౌల్ట్రీఫామ్‌కు సమీపంలోని విద్యుత్ స్తంభం వంగిపోగా.. దాన్ని మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. ఈ విషయం పౌల్ట్రీరైతు రాజిరెడ్డికి తెలపలేదు. వరుసగా నాలుగు గంటలు కరెంట్ నిలిచిపోవడంతో దాదాపు వెయ్యి వరకు కోళ్లు చనిపోయాయి. సెస్ అధికారులు ముందస్తు సమాచారం ఇస్తే ఫామ్ వద్ద జనరేటర్ ఏర్పాటు చేసుకునేవాడినని రాజిరెడ్డి పేర్కొన్నారు. తనకు భారీ నష్టం జరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పౌల్ట్రీఫామ్‌ను పరిశీలించి, బాధిత రైతును సెస్ సంస్థ ఆదుకోవాలని కోరారు.

గుండెపోటుతో 104 కాంట్రాక్టు డ్రైవర్ మృతి

- డీఎంహెచ్‌వో వేధింపులే కారణమని ఆందోళన
- న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగుల డిమాండ్



రాజ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న మేనకోడలు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలో 104 కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్న కొక్కుల రాజ్‌కుమార్ (47) గుండెపోటుతో చనిపోయాడు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులకు హాజరైన రాజ్‌కుమార్ స్పృహతప్పి కింద పడిపోవడంతో తోటి ఉద్యోగులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండపోటుతో చనిపోయాడని నిర్ధారించారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన రాజ్‌కుమార్ జగిత్యాల 104 విభాగంలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి కొద్ది రోజులుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు కేటాయించారు. శుక్రవారం ఉదయం కార్యాలయంలో తీవ్ర అస్వస్థతకు గురికాగా తోటి ఉద్యోగులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన రాజ్‌కుమార్ బంధువులు, తోటి కాంట్రాక్టు ఉద్యోగులు అక్కడికి చేరుకున్నారు. ఆరునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పాటు రాజ్‌కుమార్‌కు వారం, పదిరోజులుగా విరామం లేకుండా విధులు కేటాయించాడంతో అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు. డీఎంహెచ్‌వో కాంట్రాక్టు ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. ఈ కారణంగానే రాజ్‌కుమార్ గుండెపోటుతో చనిపోయాడని ఆందోళన చేపట్టారు. రాజ్‌కుమార్ మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

- హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ



షాపులో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

జమ్మికుంట: వానాకాలంలో రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయశాఖ ఏవో గోవర్ధన్‌రెడ్డి, సీఐ వరగంటి రవితో కలిసి శుక్రవారం సందర్శించారు. అకౌంట్ రిజిస్టర్, ఇన్‌వాయిస్, కంపెనీ కొనుగోలు రశీదులుతోపాటు పలు అంశాలపై తనిఖీలు చేపట్టారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తీసుకోవాలని, తక్కువ ధరక వస్తున్నాయనే ఆశతో నకిలీ విత్తనాలు కొంటే పంట దిగుబడి తగ్గడంతోపాటు ఆర్థికంగా నష్టపోతారని, నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని, రైతులు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని, నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, వ్యవసాయ అధికారులు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆవు, లేగదూడ విక్రయించిన

పూజారిపై ఫిర్యాదు

చందుర్తి(వేములవాడ): మండలంలోని నర్సింగపూర్–మోహినికుంట శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి ఓ భక్తులు ఇచ్చిన ఆవు, లేగదూడను పూజారి భద్రయ్య విక్రయించారని దేవాదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్‌కు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నక్క గంగాధర్, సభ్యులు కాసారపు శ్రీనివాస్‌రెడ్డి, పెరుక గంగరాజు, చింతకుంట గంగాధర్, ఇల్లంతకుంట గణేశ్, కొత్త ఎల్లారెడ్డి, సంపునూరి దశరథం ఉన్నారు.

వెంకన్నకు క్షీరాభిషేకం

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసచార్యులు మంత్రోచ్ఛవాలతో ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీహవనం నిర్వహించారు.

తాయెత్తు కట్టి రూ.30లక్షలు వసూలు చేసి

- పోలీసులను ఆశ్రయించిన మహిళ

వేములవాడ: తాయెత్తు కట్టి ఆరోగ్యం బాగుచేస్తానని ఓ మహిళ నుంచి రూ.30లక్షలు వసూలు చేసిన మోసగాడి ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదుతో సదరు మోసగాడిపై వేములవాడ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడటౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాలు. మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన మహిపాల్ అనే వ్యక్తి హన్మక్కపల్లికి చెందిన అంజవ్వ ఆరోగ్యం బాగుచేస్తానని నమ్మబలికి తాయెత్తులు ఇచ్చి.. ఆమె నుంచి రూ.30లక్షలు వసూలు చేశాడు. మోసపోయానని గ్రహించిన అంజవ్వ ఫిర్యాదుతో విచారణ చేపట్టి మహిపాల్‌పై కేసు నమోదు చేసి, సదరు మోసగాడి వద్ద ఉన్న తాయెత్తులను స్వాధీనం చేసుకున్నారు.

వాహనాల దొంగ అరెస్ట్



బైక్‌లతో పోలీసులు

కరీంనగర్‌క్రైం: బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. కరీంనగర్ బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండకు చెందిన ప్రస్తుతం వేములవాడలో ఉంటున్న భూక్య కృష్ణరాథోడ్ అనుమానాస్పదంగా వ్యవహరించాడు. పోలీసులు అతడిని తన వద్ద ఉన్న బైక్‌పత్రాలు అడుగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ దొంగతనాలు చేస్తున్న విషయాన్ని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. నిందితుడి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై స్వామి, హెడ్‌కానిస్టేబుల్ హసనొద్దీన్, కానిస్టేబుల్ బషీరోద్దీన్‌లను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ అభినందించారు.

పూచీకత్తు పెట్టిన ఇంటిపై రుణం

- రాగుల రాములుపై మరో కేసు

సిరిసిల్లక్రైం: అప్పు కోసం ఒకరు పూచీకత్తు పెట్టిన ఇంటిపై రుణం తీసుకొని, అసలు యజమానికి టోకరా పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సిరిసిల్లకు చెందిన రాగుల రాములు బాధితులు ఒక్కరొక్కరుగా బయటకు వస్తున్నారు. రాములు బాధితుడు మరొకరు శుక్రవారం సిరిసిల్ల పోలీసులను శుక్రవారం సంప్రదించాడు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాకం పెద్దబాబు తన అవసర నిమిత్తం రాగుల రాములును రూ.3లక్షలు అప్పు అడిగాడు. పూచీకత్తుగా పెద్దబాబు ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఇంటి కాగితాలను రాగుల రాములు ఓ బ్యాంక్‌లో తనఖా పెట్టి ఏకంగా రూ.20లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన పెద్దబాబు తన ఇంటిపై ఎలా లోన్ తీసుకున్నావని రాములును నిలదీశాడు. తన ఇంటిని మళ్లీ తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా.. తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు పెద్దబాబు శుక్రవారం సిరిసిల్ల పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఇంకా ఎవరైనా రాగుల రాములు బాధితులు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

జ్యోతినగర్(రామగుండం): ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులో బ్లూకోల్ట్స్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. శాంతిభద్రతల్లో భాగంగా ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వద్ద విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బందిపై మల్యాలపల్లి ఐవోసీ ప్రాంతానికి చెందిన దేవేందర్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించినందుకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరా నగర్‌లో శుక్రవారం ఒకరు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. ఇందిరానగర్‌కు చెందిన చల్ల నర్సయ్య(53) శుక్రవారం ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డు పైపున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సయ్యకు ముగ్గురు కూతుళ్లు కాగా రూ.8 లక్షల అప్పుచేసి కూతుళ్ల వివాహాలు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య చల్ల లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

వీణవంక(హుజూరాబాద్): కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన గట్టు సాయికీర్తన (17) ఈ నెల 17న కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగింది. సిరిసిల్ల జిల్లాలోని గురుకల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తరుచూ కడుపు నొప్పితో బాధపడేదని, ప్రస్తుతం ఇంటి వద్దే ఉండగా ఆత్మహత్యకు పాల్పడిందని, మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి గట్టు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

క్లుప్తంగా

హరితహారానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలి

ఇబ్రహీంపట్నం : హరితహారంలో భాగంగా మొక్కటు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వర్షకొండలో నర్సరీలోని మొక్కలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతివనం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 2వేల 500 క్వింటాళ్ల ధాన్యం ఉండగా, వెంటనే కొనుగోళ్లను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడ ఆర్ఐ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, నాయకులు తుక్కారం, తదితరులున్నారు.

ఉపాధ్యాయుల 'బడిబాట'

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను ఇంటింటా వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సాయికృష్ణ, అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు రమేశ్, రాజేశ్, అంగన్‌వాడీ టీచర్లు వసంత, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 22 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు ఒక్కరూ పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో జగిత్యాల విద్యార్థిని నృత్యం

జగిత్యాలరూరల్: అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి పట్టణంలోని కదిరె వెంకటరమణరావు కళాక్షేత్రంలో అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు వైభవంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణానికి చెందిన గుండి జగదీశ్వర్–యమున కుమార్తె లాస్యప్రియ మామవతుశ్రీ సరస్వతి అనే నృత్య అంశం ప్రదర్శించి పలువురి మన్ననలు పొందింది. లాస్యప్రియ ఇప్పటివరకు సుమారు 100 ప్రదర్శనలు చేసి ఆకట్టుకుంది.

సన్మానం

కోరుట్లటౌన్: నేషనల్ క్యాడెట్ కోర్సు (ఎన్‌సీసీ) శిక్షణ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని కరస్పాండెంట్ బండి మహదేవ్ అన్నారు. శుక్రవారం ఎన్‌సీసీ శిక్షణ పొందిన స్కూల్ పీఈటీ సంగ మహేశ్‌ను యాజమాన్యం సన్మానించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, యాజమాన్యం ప్రతినిధులు రాజు, శంకర్, వినోద, సంధ్యారాణి పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు అందించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని రైతులకు జనుము, జీలుగ విత్తనాలను అందించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలకు, ఆగ్రోస్ సంస్థకు విత్తనాలు రావాల్సి ఉండగా, ఇంతవరకు సరఫరా చేయలేదని, పక్క మండలాల్లో విత్తనాలు సరఫరా చేయగా రైతులు పొలాల్లో విత్తనాలు చల్లినట్లు తెలిపారు. వెంటనే వ్యవసాయ అధికారులు జనుము, జీలుగ విత్తనాలు అందించాలని కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

రాయికల్: భూపతిపూర్‌లోని జిల్లాపరిషత్‌లో చదివిన మణిదీప్ హైదరాబాద్‌లోని మేధా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు సిరిపురం మహేశ్ శుక్రవారం తెలిపారు.

పరామర్శ

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామానికి చెందిన చేని భాగ్య, పాముల బాబు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో వేముల చిన్న కొమురయ్య మరణించారు. వారి కుటుంబ సభ్యులను శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం పరామర్శించారు. మూడు కుటుంబాలకు మొత్తం రూ.20వేలు ఆర్థిక సాయమందించారు. నాయకులు చిలువేరి నారాయణగౌడ్, మేనేని రాజనర్సింగరావు, తాళ్లపెల్లి అంజయ్యగౌడ్, కమలాకర్‌రెడ్డి, అంబాటి తిరుపతి, తాళ్ళపెల్లి విక్రమ్, బొడ్డెల్లి భరత్, చిర్ర నవీన్, చీకట్ల సాయిలు తదితరులున్నారు.

కమీషన్ ఏజెంట్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి

జగిత్యాలటౌన్/జగిత్యాల: 4శాతం కమీషన్ స్థానంలో 10శాతం వసూలు చేస్తూ కమీషన్ ఏజెంట్లు మామిడి రైతులను దగా చేస్తున్నా.. ప్రధాన పార్టీల నాయకులు స్పందించకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్ అన్నారు. శుక్రవారం సీపీఐ నాయకులతో కలిసి మ్యాంగో మార్కెట్‌ను సందర్శించారు. వెన్న మహేశ్, దేవదాస్ తదితరులున్నారు.

పోడు పట్టాల కోసం ఎదురుచూపులు

- మంజూరవుతాయనే ఆశతో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు
- ఏళ్లుగా భూములు సాగు చేస్తున్నా పట్టాలివ్వడం లేదంటున్న గిరిజనులు



పోడు భూములకు పట్టాలివ్వాలని కథలాపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన మండల గిరిజనులు (ఫైల్)

కథలాపూర్: అటవీ భూములను చదును చేసి ఏళ్లుగా సాగు చేసుకుంటున్నవారికి హక్కులు కల్పించేందుకు గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. పోడు భూములు సాగు చేసుకుంటున్నవారు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అప్పట్లో ప్రకటించడంతో.. గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకొని ఏడాదిగా ఎదురుచూసిన తమకు పట్టాలివ్వలేదని కథలాపూర్ మండలంలోని గిరిజనులు వాపోతున్నారు. వందలాది మంది దరఖాస్తు చేసుకుంటే మండలంలో ఒక్కరికే పట్టా మంజూరు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి మరోసారి సర్వే చేసి అర్హులైనవారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

721 మంది దరఖాస్తులు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. అనుబంధంగా 9 గిరిజన తండాలున్నాయి. పోడు భూములు సాగు చేసుకుంటున్నవారు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించి గ్రామసభలు నిర్వహించారు. దీంతో మండలంలో 721 మంది గిరిజనులు 859 ఎకరాల్లో పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. దరఖాస్తుల ఆధారంగా అధికారుల బృందం క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి నివేదికలు రూపొందించారు. మండల, డివిజనల్, జిల్లాస్థాయి అధికారులకు నివేదికలు అందజేశారు. గతేడాది జూన్ 30న పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. లబ్ధిదారుల జాబితాలో మండలంలో ఒక్కరి పేరే ఉండటంతో దరఖాస్తుదారులు అవాక్కయ్యారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సాగు చేసుకుంటున్న వారికి పట్టాలివ్వాలని గిరిజనులు కోరుతున్నారు.

మూడెకరాలు సాగు చేస్తున్న



నాకు సొంతంగా సాగు భూమి లేదు. మా నివాసాలకు దగ్గరగా ఉన్న మూడెకరాల అటవీ భూమిని ఏళ్లుగా సాగు చేస్తూ జీవిస్తున్న. పోడు భూములకు పట్టాలిస్తారని తెలపడంతో దరఖాస్తు పెట్టుకుంటే జాబితాలో నా పేరు లేదు. తీవ్ర నిరాశకు గురయ్యా. సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలివ్వాలి.

– బానోత్ సంతోష్, తాండ్ర్యాల ఎక్స్‌రోడ్డు

న్యాయం చేయాలి



అడవులను నమ్ముకొని ఏళ్లుగా బతుకుతున్నం. రెండెకరాల్లో అటవీ భూములను చదును చేసిన. ఎండనక వాననక శ్రమించి పంటలు పండిస్తున్నం. ఎప్పటికైనా పోడు భూములకు పట్టాలిస్తారనే ఆశలో ఉన్నం. గతేడాది పట్టాలిచ్చేటప్పుడు మా పేరు అందులో లేదు. ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గిరిజనులకు న్యాయం చేయాలి.

– రవినాయక్, రాజారాం తండా

సంక్షిప్త వార్తలు

ఐకేపీ కేంద్రాన్ని సందర్శించాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని ఐకేపీ(సెర్ప్) కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారించాలని రామకిష్టు సతీశ్‌తోపాటు పలువురు రైతులు కోరుతున్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

సారంగాపూర్: సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ అందుబాటులో ఉన్నాయని సంఘ సీఈవో ఇస్మాయిల్ తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్‌ను అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండలంలోని మూడు సబ్ స్టేషన్ల పరిధి గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ తెలిపారు. సారంగాపూర్ మండలానికి జగిత్యాల నుంచి వచ్చే 33 కేవీ లైన్లలో కొమ్మలు, పొదలు తొలగించేందుకు సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ధర్మపురి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని విప్ లక్ష్మణ్‌కుమార్ సూచించారు. నక్కలపేట గ్రామంలో వాలీబాల్ ఫైనల్ పోటీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత పవర్ స్టార్ యూత్ జట్టుకు రూ.5వేల నగదుతో పాటు బహుమతి అందజేశారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రాయికల్: భూపతిపూర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి, తాజా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మహేశ్వర్‌రావు, నాయకులు మహేందర్‌గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయంలో అభిషేకాలు

రాయికల్: మూటపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పూర్ణచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.



వైభవంగా నృసింహుడి రథోత్సవం

కథలాపూర్: మండలంలోని దుంపేటలో లక్ష్మీ లక్ష్మి నృసింహస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధానవీధుల గుండా రథాన్ని లాగారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మొక్కలు ఎండిపోతే మళ్లీ నాటాలి

- జిల్లా అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్



అధికారులకు వివరిస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

కథలాపూర్: హరితహారంలో భాగంగా గ్రామాల్లో రోడ్ల పక్కన నాటిన మొక్కలు ఎండిపోతే వాటిస్థానంలో కొత్త మొక్కలు నాటించాలని జిల్లా అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లో ఏడాదిలో ఉపాధిహామీ పథకంలో రూ. 3.81 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీల బృందం గ్రామాలవారీగా పరిశీలించి నివేదికలను ప్రజావేదికలో అందించారు. జాబ్‌కార్డుల అప్‌డేట్‌పై ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నెలనెలా నాలుగో శుక్రవారం రోజ్‌గార్ దివస్ గ్రామసభలు నిర్వహించాలని, లేకపోతే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. హరితహారం ప్రతిగ్రామంలో 10వేల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ఉపాధిహామీ రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని, పనుల్లో నిర్లక్ష్యం చేశారన్న కారణంతో మండలంలోని 16 మంది పంచాయతీ కార్యదర్శులకు రూ. 49,181 జరిమానా, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.18,706 జరిమానా విధించారు. కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 2 వేలు, ఏపీవోకు రూ. 8,893, ఎంపీడీవోకు రూ. 3,856 జరిమానా విధించారు. అధికారులకు, సిబ్బందికి కలిపి రూ. 83,660 జరిమానా విధించినట్లు తనిఖీ అధికారులు పేర్కొన్నారు. డీఆర్డీఏ విజిలెన్స్ అధికారి చిన్నయ్య, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, ఎస్ఆర్‌పీ భగవంత్‌రావు, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్లాపూర్: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కేఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆట పాటలతో రోజంతా ఆనదంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తోట రాజశేఖర్, బండి స్వామి, ముత్యాల రాజేశ్, నాగుల వినోద్, కండెల రాజశేఖర్, శ్రవణ్‌కుమార్, భూమేశ్, అంజి, రమేశ్, రాజు, జీవన్, దివ్య, ప్రియ, సుమలత, రాధ, సమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమాత కల్యాణం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి శివారు పెద్దచెరువు వద్ద గంగమాత ఆలయంలో శుక్రవారం ఆదర్శ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమాత కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో తరలివెళ్లి గంగమాతకు నైవేద్యం సమర్పించారు. గ్రామ పురవీధుల గుండా గంగపుత్రుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గంగమాత కల్యాణంతో పాటు యజ్ఞాన్ని వైభోవపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆదర్శ గంగపుత్ర సంఘం నాయకులు రొడ్డ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

కోరుట్ల రూరల్: కోరుట్లలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాలిసెట్ 2024 కోఆర్డినేటర్ రామ ప్రసాద్ తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో 1213 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1110 మంది విద్యార్థులు హాజరయ్యారని 91.5 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

అన్నమాచార్య జయంతి

మెట్‌పల్లి: పట్టణంలోని ఖాదీ ప్రతిష్టాన్ శ్రీ వేంకటేశ్వరాలయంలో గురువారం రాత్రి పద కవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతిని సప్త స్వర కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన కట్ట మంజుల, బొజ్జ రేవతి అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళాకారులను మెమొంటోలతో సత్కరించారు.

వంద రోజులుగా అన్నదానం

కోరుట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం శుక్రవారానికి వంద రోజులకు చేరింది. లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ ఉచిత అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో అల్పాహారం, అన్న ప్రసాద పంపిణీ నిర్వహిస్తున్నామని లయన్స క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షుడు వనపర్తి చంద్ర మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం 140 మందికి అల్పాహారం, 200 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశామన్నారు. ఎలిమల్ల లయన్ ఉషా కిరణ్–రజని, కార్యదర్శి మహేందర్, కోశాధికారి కృష్ణప్రసాద్, రీజినల్ చైర్మన్ శివప్రసాద్, జోన్ చైర్మన్ శోభ, మధు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో భూసార పరీక్షలు

రాయికల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఏరిస్ ఆగ్రోస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. భూసార పరీక్షల ద్వారా రైతులు పంటలు పండిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు.

అరకొరగా పచ్చిరొట్ట విత్తనాలు

- అవసరం మేరకు సరఫరా చేయాలంటున్న రైతులు

పెగడపల్లి: మండలానికి పచ్చిరొట్ట విత్తనాలు అరకొరగా సరఫరా చేయడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తే రైతులు పొలాల్లో పచ్చిరొట్ట పెంచి భూమిలో కలియదున్ని సేంద్రియ ఎరువుగా పంటలకు అందించుకుంటున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలుండగా.. సుమారు 28వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పెగడపల్లి మండలంలోని పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార కేంద్రాలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సుమారు 550 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సరఫరా చేసింది. రెండు రోజుల్లో వీటి పంపిణీ పూర్తయి కొరత ఏర్పడింది. అరకొరగా సరఫరా కావడంతో చాలామంది రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందని ద్రాక్షలా మారింది. పచ్చిరొట్ట విత్తనాల కోసం నిత్యం రైతులు ఆయా సంఘాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఖాళీ చేతులతో తిరిగి వెళ్తున్నారు. రెండో విడత విత్తనాల సరఫరాపై వ్యవసాయ శాఖ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి అవసరం మేరకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి

జగిత్యాలరూరల్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. శుక్రవారం హన్మాజీపేట గ్రామంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి బాలికను చదివించాలని, విద్యతోనే మహిళ సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు అబల కాదు సబల అని నిరూపించేందుకు పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న హింసలకు, వాటి నిరోధానికి మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారయ్యేందుకు కృషి చేయాలని అన్నారు. మహిళలు హింసకు గురైనప్పుడు 181, 1098 మహిళ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని అవగాహన కల్పించారు. ఎంపీవో గంగలక్ష్మణ్, ఫీల్డ్ ఆఫీసర్ రేవతి, గౌతమి, హేమశ్రీ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



జరిమానా రశీదు అందజేస్తున్న మహిళ

జగిత్యాలక్రైం: బైండోవర్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాటు సారా అమ్ముతూ పట్టుబడిన భూపల్లి రాజవ్వపై గతంలో కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. కానీ రాజవ్వ బైండోవర్ నిబంధనలు అతిక్రమించి గుడుంబా అమ్ముతుండగా.. ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని శుక్రవారం జగిత్యాల అర్బన్ తహసీల్దార్ వర్ధన్ ముందు హాజరుపర్చారు. రాజవ్వకు రూ.50వేల జరిమానా విధించారు. రాజవ్వ రూ.50వేల జరిమానా చెల్లించి రశీదును ఎక్సైజ్ సీఐ సర్వేశ్‌కు అందజేశారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. అక్రమంగా గుడుంబా, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



ఆలయంలో హోమం చేస్తున్న గౌడ కులస్తులు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయంలో హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. శనివారం జోగు ఎత్తుట, ఆదివారం పోచమ్మకు బోనాలు, సోమవారం పుట్టకాడికి, గంగబోనం, మంగళవారం ఎల్లమ్మ తల్లికి బోనాలు, పట్నాలు, కల్యాణం నిర్వహించనున్నట్లు గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తెలిపారు.

వలసజీవి అంత్యక్రియలు పూర్తి

- నెల రోజుల క్రితం గల్ఫ్‌లో మృతి



గణేశ్(ఫైల్)



అంతిమ యాత్రలో పాల్గొన్న నరేశ్‌రెడ్డి

మేడిపల్లి: మండలంలోని మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేశ్ నెలరోజుల క్రితం మృతిచెందాడు. గురువారం స్వగ్రామానికి మృతదేహం చేరుకోగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన భూమల్ల గణేశ్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ ఓ క్లీనింగ్ కంపెనీలో క్లీనర్‌గా పనిచేస్తుండగా నెలరోజులక్రితం ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందాడు. గణేశ్ మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. దుబాయి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా గురువారం అంత్యక్రియాలు పూర్తిచేశారు. మృతుడికి భార్య రజిత, కుమారులు శివ(5), వంశీ(1), కుతురు హర్షవర్ధిని(3) ఉన్నారు. శివ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, ఆపరేషన్‌కు రూ.5లక్షల వరకు అవుతాయని బంధువులు తెలిపారు. టీపీసీసీ గల్ఫ్ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. దుబాయి పర్యటనలో ఉన్న ఎమెల్యే ఆది శ్రీనివాస్ రాగానే ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

మల్లాపూర్: రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు నానాతిప్పలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులు ఇష్టారీతిన ధాన్యం తూకం వేయడం, అవకతవకలకు పాల్పడుతున్నారు. కొంతమంది గుర్తించి నిలదీయడంతోపాటు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేస్తున్నారు. రాఘవపేట ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఇలాంటి ఘటనే శుక్రవారం చోటు చేసుకుంది. ఐకేపీ సీసీ రాజు, నిర్వాహకులు రమ్యను ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలపై నిలదీశారు. బ్యాగుకు 41.200 తూకం వేసి తరలించిన ధాన్యానికి మళ్లీ మిల్లర్ల వద్ద అదనపు తూకంతో ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. తూకం వేసి మిల్లుకు తరలించిన ధాన్యానికి ట్రాక్ షిట్ తెప్పించడంలో జాప్యం ఎందుకు జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

సౌదీలో అనారోగ్యంతో కార్మికుడు

- స్వదేశం రప్పించేందుకు ఎమ్మెల్సీ కృషి



జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కాలనీకి చెందిన సిరిమల్ల విష్ణు అనే వ్యక్తి ఏప్రిల్ మొదటి వారంలో ఓ కంపెనీలో క్లీనర్‌గా పని చేసేందుకు సౌదీ అరేబియాలోని రియాద్‌కు వెళ్లాడు. వెళ్లేటప్పుడు ఆరోగ్యంగా ఉన్న విష్ణు అక్కడకు చేరుకున్నాక వాతావరణంలో మార్పులతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరాడు. అతన్ని స్వదేశానికి పంపించేందుకు కంపెనీ కృషి చేయకపోవడంతో విష్ణు కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన జీవన్‌రెడ్డి విష్ణును ఇండియాకు పంపించాలని కోరుతూ ఫ్యాక్స్ ద్వారా సీఎం కార్యాలయానికి, సౌదీ అరేబియాలోని ఇండియన్ ఎంబసీకి, ఢిల్లీలోని విదేశాంగ శాఖకు లేఖ పంపించారు. భారత రాయబార కార్యాలయ అధికారులు స్పందించి కంపెనీ యజమాన్యాన్ని విష్ణును ఇంటికి పంపించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విష్ణును స్వదేశానికి పంపించేందుకు సోషల్ వర్కర్స్ ఇర్ఫాన్, ఫారూక్, చేతన, లతీఫ్, షిహబ్ సహకరిస్తున్నారు.